సాక్షి
రాజన్న సిరిసిల్ల

బుధవారం । 11 । సెప్టెంబర్ । 2024

న్యూస్‌రీల్

రాజన్న గుడి విస్తరణ షురూ చేయండి

• సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం



సీఎం రేవంతర్‌రెడ్డికి చిత్రపటం, ప్రసాదం అందజేస్తున్న విప్ ఆది శ్రీనివాస్, అర్చకుడు

వేములవాడ: వేములవాడ రాజన్న గుడి విస్తరణ పనులు సత్వరమే ప్రారంభించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించినట్లు ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. సీఎం ఆదేశాల మేరకు సీఎం ఓఎస్డీ శ్రీనివాసులు, ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్‌లతో కూడిన అధికారులు, అర్చకుల బృందం ఈనెల 9న శృంగేరి పీఠాధిపతులను కలసి రాజన్న గుడి విస్తరణకు సంబంధించిన నమూనాలను జగద్గురు భారతీ తీర్థ మహాస్వాములు, పీఠాధిపతి విధిశేఖర భారతి స్వాములకు చూపించారు. అనంతరం వారి సలహాలు, సూచనలను మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు వివరించారు. ఈ మేరకు పనులు ప్రారంభించాలని ఆదేశించినట్లు చెప్పారు. అనంతరం సీఎంకు జగద్గురులు భారతీతీర్థ మహాస్వాములు, పీఠాధిపతి విధిశేఖర భారతి స్వాములు ఇచ్చిన మహాప్రసాదం, శృంగేరి పరంపర చిత్రపటాన్ని శృంగేరిపీఠం తెలంగాణ బాధ్యులు రాధాకృష్ణ అందజేశారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి



విద్యార్థుల ప్రగతిని పరిశీలిస్తున్న డీఈవో

గంభీరావుపేట(సిరిసిల్ల): పదో తరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించాలని, అందుకోసం ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని కేజీ టు పీజీ విద్యాసంస్థల్లో భాగమైన జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థుల చదువు సామర్థ్యం, ప్రగతిని పరిశీలించారు. వందశాతం ఫలితాలు సాధించేందుకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన వెంట జెండర్ ఈక్విటీ కో ఆర్డినేటర్ పద్మజ, ఇన్‌చార్జి హెచ్‌ఎంలు రమాదేవి, భూస లక్ష్మణ్, ఉపాధ్యాయులు ఉన్నారు.

పాఠశాల సందర్శన



మాట్లాడుతున్న జెడ్పీ సీఈవో వినోద్

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్‌లోని మహాత్మ జ్యోతిబాపూలే బాలుర పాఠశాలను మంగళవారం జెడ్పీ సీఈవో వినోద్ సందర్శించారు. తరగతి గదులు, వంట గదులు పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా అని ఆరా తీశారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. తర్వాత ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో రాజీవ్ మల్హోత్ర తదితరులు పాల్గొన్నారు.

కార్మికులు ధైర్యంగా ఉండాలి



కార్మికవాడల్లో సదస్సు నిర్వహిస్తున్న పున్నం చందర్ తదితరులు

సిరిసిల్లటౌన్: కార్మికులతో పరస్పర చర్చల ద్వారా ఆత్మహత్యలను చాలా వరకు తగ్గించవచ్చని సిరిసిల్ల మనోవికాస కేంద్రం సైకాలజిస్టు పున్నంచందర్ అన్నారు. మంగళవారం ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా కార్మిక వాడల్లో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుల్లో మాట్లాడారు. మానసిక కుంగుబాటు ఆత్మహత్యలకు దారి తీస్తుందని, కార్మికులు ఎల్లవేళలా ధైర్యంగా ఉండాలన్నారు. సిరిసిల్లలోని మైండ్ కేర్ సెంటర్ గత పదిహేనేళ్లుగా ఆత్మహత్యల నివారణకు కృషి చేస్తుందన్నారు. ఎలాంటి మానసిక రుగ్మతలున్నా వెంటనే తమను సంప్రదించి స్వాంతన పొందాలని కోరారు. సెంటర్ కార్యకర్తలు రాపెల్లి లత, కొండ ఉమ, వేముల అన్నపూర్ణ, బూర శ్రీమతి తదితరులున్నారు.

‘ఎమ్మెల్సీ’ హీట్!

ఆశావహుల ముందస్తు ప్రచారం

- వచ్చేనెల ఒకటి నుంచి ఎన్‌రోల్‌మెంట్ మొదలు
- పట్టభద్రుల వివరాల సేకరణ
- ప్రధాన పార్టీల నుంచి బలమైన అభ్యర్థులు
- ముందు మరింత పెరగనున్న పోటీ



బీఎన్ రావు　రవీందర్‌సింగ్　నరేందర్‌రెడ్డి　వి.రాజేందర్‌రావు　పి.సుగుణాకర్‌రావు　రాణీరుద్రమ



సాక్షిప్రతినిధి,కరీంనగర్:

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఆశావహులు స్పీడు పెంచారు. అక్టోబరు ఒకటి నుంచి పట్టభద్రులు ఎన్‌రోల్‌మెంట్ చేసుకునేందుకు ఇటీవల ఎన్నికల కమిషన్ అనుమతించిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల స్థానానికి పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్న ఆశావహులు స్పీడు పెంచారు. ఎవరికి వారు తాము అభ్యర్థులమన్న సంకేతాలు ఇస్తున్నారు. మరికొందరు అడుగు ముందుకేసి అప్పుడే మద్దతు కూడగట్టే ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ పోటీలో అధికార కాంగ్రెస్‌తోపాటు బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీ అభ్యర్థులు సైతం తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమవుతున్నారు. అయితే ఇంట గెలిచి, రచ్చ గెలవాలన్న సామెత వీరిలో చాలా మందికి వర్తించకపోవడం గమనార్హం. పార్టీ తమకు వేదిక అవుతుందని, టికెట్ రాకపోయినా బరిలో ఉండేందుకు సిద్ధంగా ఉండటం విశేషం. ముందు ఈ పోటీ ఇటు అన్ని పార్టీల్లో పెరిగి, స్వతంత్రుల సంఖ్యా పెరిగే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.

గులాబీ పార్టీలో ఇద్దరి మధ్యే పోటీ

బీఆర్‌ఎస్ నుంచి టికెట్ ఆశిస్తున్న వారిలో బీఎన్ రావు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డా.బీఎన్‌రావు, మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్ ప్రముఖంగా ఉన్నారు. బీఎన్‌రావు ముందు నుంచి ఎమ్మెల్సీ స్థానం కోసం గ్రౌండ్‌వర్క్ చేస్తున్నారు. కొన్నేళ్లుగా పేదలకు చేస్తున్న ఉచిత మోకీలు ఆపరేషన్లతోపాటు.. ఎమ్మెల్సీ ఎన్నికలే లక్ష్యంగా మేధావులతో సమావేశాలు, ఎంఐఏ మాజీ రాష్ట్ర అధ్యక్షుడిగా వైద్య, పారా మెడికల్ సిబ్బంది మద్దతు కోరుతున్నారు. నిరుద్యోగులకు పోటీపరీక్షల మెటీరియల్స్ అందజేస్తున్నారు. కరీంనగర్ మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్ కూడా ఎమ్మెల్సీ రేసులో సీరియస్‌గానే ఉన్నారు. గత స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలో తనకు వచ్చిన ఓట్లు, మేయర్‌గా అందించిన సేవలు, ప్రైవేటు టీచర్లు, లెక్చరర్లకు చేసిన సేవల ఆధారంగా మద్దతు కూడగడుతున్నారు.

నరేందర్‌రెడ్డి వర్సెస్ వెలిచాల..

కాంగ్రెస్ నుంచి ఆశావహుల జాబితా చాంతాడంత ఉంది. ప్రస్తుతం ఇద్దరు బలమైన అభ్యర్థులు టికెట్ ఆశిస్తున్నారు. వీరిలో ఒకరు ఆల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత నరేందర్ రెడ్డి కాగా, మరొకరు ఇటీవల కరీంనగర్ పార్లమెంటు నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన వెలిచాల రాజేందర్‌రావు. నరేందర్ రెడ్డి కాంగ్రెస్ తనకు ఎమ్మెల్సీగా అవకాశం ఇస్తుందని బలంగా నమ్ముతున్నారు. టికెట్ రాకపోయినా స్వతంత్రుడిగానైనా పోటీలో నిలబడాలన్న ఆలోచనలో ఉన్నారు. ఉత్తర తెలంగాణలో తన విద్యాసంస్థలు, తనకున్న పరిచయాలతో గ్రాడ్యుయేట్ల వివరాలు ఎన్‌రోల్‌మెంట్ కోసం సేకరిస్తున్నారు. వెలిచాల రాజేందర్ రావు ఎంపీ ఎన్నికల అనంతరం నియోజకవర్గంలో క్రియాశీలకంగా ఉన్నారు. సిరిసిల్ల చేనేతకు ప్రభుత్వ బ్రాండింగ్, ట్రేడింగ్‌లో శిక్షణ, గ్రాడ్యుయేట్లకు మేనిఫెస్టోలతో ముందుకెళ్తున్నారు. ఎమ్మెల్సీగా అవకాశమిస్తే సిద్ధమేనని, పార్టీ నిర్ణయమే తనకు శిరోధార్యమని, ఎవరికి టికెట్ ఇచ్చినా బలపరుస్తానని స్పష్టం చేస్తున్నారు.

కమలనాథుల్లో ఉత్కంఠ..

బీజేపీలోనూ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి ఇద్దరి మధ్య తీవ్రపోటీ నెలకొంది. వారిలో ఒకరు సీనియర్ నేత పొల్సాని సుగుణాకర్ రావు, మరొకరు రాణీ రుద్రమ. వీరిద్దరూ తమకు టికెట్ కావాలని అధిష్టానం వద్ద ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. పార్టీలో సీనియర్ నేత అయిన తనకు ఇటీవల అసెంబ్లీ, ఎంపీ ఎన్నికల్లో అవకాశం దక్కలేదని, ఈసారి ఎలాగైనా తనకు ఎమ్మెల్సీ అవకాశం ఇవ్వాల్సిందేనని సుగుణాకర్ రావు పట్టుబడుతున్నారు. రాణీరుద్రమకు సిరిసిల్ల నుంచి అవకాశం కల్పించారని, కాబట్టి ఈసారి తమకు ఇవ్వాల్సిందేని సుగుణాకర్‌రావు వర్గం వాదిస్తోంది. మరోవైపు రాణీ రుద్రమ మాత్రం తన ప్రయత్నాలు చేసుకుంటున్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

• కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



భోజనం తయారీని పరిశీలిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

కోనరావుపేట(వేములవాడ): ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ విద్యాలయంలో విద్యార్థులకు అన్ని వసతులు కల్పించి వందశాతం ఉత్తీర్ణత సాధించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశించారు. మంగళవారం మండలంలోని మర్రిమడ్ల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ విద్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణ, తరగతి గదులు, కిచెన్ తదితర వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బాలుర, బాలికల డార్మెటరీ, తరగతి గదుల్లో ఏమైనా ఇబ్బందులు, సమస్యలు ఉన్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. భోజన సదుపాయం, పాఠాలు ఎలా బోధిస్తున్నారు అనే అంశాలపై ఆరా తీశారు. టాయిలెట్లు తక్కువగా ఉన్నాయని, దీంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని విద్యార్థులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. కలెక్టర్ వెంటనే రెండు టాయిలెట్లు మంజూరు చేసి పనులు ప్రారంభించాలని కోనరావుపేట ఎంపీడీవోను ఆదేశించారు. అలాగే గ్రామం నుంచి విద్యాలయం వరకు రోడ్ సరిగా లేదని, రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. ఉపాధ్యాయుల బోధన తీరును పరిశీలించారు. అన్ని సబ్జెక్టులలో విద్యార్థులు మంచి మార్కులు సాధించేలా పాఠాలు చెప్పాలని సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, తహశీల్దార్ విజయప్రకాశ్‌రావు, ఇతర అధికారులు ఉన్నారు. తర్వాత నిమ్మపల్లి గ్రామంలో చేపడుతున్న బ్రిడ్జి మరమ్మతు పనులను కలెక్టర్ పరిశీలించారు.

సారూ.. జర బస్సు అచ్చేలా సూడున్రి

• ఎస్పీ అఖిల్ మహాజన్‌కు విన్నవించిన వృద్ధురాలు



కొత్తపేటకు బస్సు నడిపించాలని ఎస్పీ అఖిల్‌మహాజన్‌కు విన్నవిస్తున్న ఎల్లమ్మ

చందుర్తి(వేములవాడ): ‘ప్రాణం మంచిగా లేకపోతే మందులు, సూదులు వేయించుకునేందుకు రుద్రంగికి పోవాలన్న మాకు బస్సు లేక గోసైతుంది. సారూ.. జర బస్సు అచ్చేలా సూడున్రి’ అంటూ 80 ఏళ్ల వృద్ధురాలు చిలువేరి ఎల్లమ్మ ఎస్పీ అఖిల్ మహాజన్‌ను వేడుకుంది. మంగళవారం రాత్రి చందుర్తి మండలం కొత్తపేటలో కమ్యూనిటీ కాంటాక్ట్‌లో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశంలో గ్రామస్తుల సమస్యలను ఎస్పీ తెలుసుకున్నారు. రోడ్డు సౌకర్యం సరిగా లేక బస్సులు రావడం లేదని, గ్రామానికి చెరువులు, కుంటలు లేక ఉపాధి కోల్పోతున్నామని, గ్రామానికి 30 మీటర్ల దూరంలోని చెరువు తమ సరిహద్దులో ఉన్నా తుర్తి గ్రామస్తుల అభ్యంతరంతో ఇబ్బందులు పడుతున్నామని ఎస్పీకి గ్రామస్తులు వివరించారు. కలెక్టర్‌కు చెప్పి సమస్య పరిష్కారమయ్యేలా చూస్తానని ఎస్పీ హామీ ఇచ్చారు. గ్రామస్తులు చిన్నచిన్న సమస్యలతో గొడవలు పెట్టుకుని గ్రూపులుగా విడిపోవద్దని సూచించారు. చిన్నారులకు చాక్లెట్లు పంపిణీ చేసి, యువకులకు వాలీబాల్ కిట్ అందజేశారు. అనంతరం దేవుని తండావాసుల సమస్యలు తెలుసుకుని, యువకులకు వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, సీఐ వెంకటేశ్వర్లు, రుద్రంగి ఎస్సై అశోక్ ఉన్నారు.

డయల్ 100 కాల్స్‌పై తక్షణం స్పందించాలి

సిరిసిల్లక్రైం: సిరిసిల్ల టౌన్ పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం ఎస్పీ అఖిల్ మహాజన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిధిలో నమోదవుతున్న కేసుల వివరాలు పరిశీలించారు. డయల్ 100 కాల్ రాగానే వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సమస్యలు పరిష్కరించాలని సూచించారు. పట్టణ పరిధిలో గణేశ్ ఉత్సవాలు శాంతియుత వాతావరణంలో జరిగేలా పకడ్బందీగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, సీఐ కృష్ణ ఉన్నారు.

అన్నపూర్ణలోకి కొనసాగుతున్న ఎత్తిపోతలు

ఇల్లంతకుంట(మానకొండూర్): మండలంలోని అంతగిరి గ్రామ అన్నపూర్ణ ప్రాజెక్టులోకి మిడ్‌మానేరు నుంచి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. మిడ్‌మానేరు నుంచి 6,400 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో అన్నపూర్ణ ప్రాజెక్టులోకి వస్తుండగా, ఇక్కడి నుంచి 6,600 క్యూసెక్కుల నీటిని సిద్దిపేట జిల్లాలోని రంగనాయక సాగర్ ప్రాజెక్టుకు తరలిస్తున్నారు. ప్రస్తుతం అన్నపూర్ణలో 2.76 టీఎంసీల నీరు ఉంది. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 3.5 టీఎంసీలు.



అన్నపూర్ణ ప్రాజెక్టు

చాకలి ఐలమ్మ వర్ధంతి



ఐలమ్మ వర్ధంతి వేడుకల్లో బీఆర్‌ఎస్ నేతలు తదితరులు

సిరిసిల్లకల్చరల్: తెలంగాణ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ వర్ధంతిని మంగళవారం జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఘనంగా నిర్వహించింది. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ అతిథులుగా హాజరయ్యారు. ఐలమ్మ చిత్రపటానికి పూల మాల లేసి నివాళి అర్పించారు. సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు రమేశ్, రాజేశ్వర్, బీసీడీవో రాజమనోహర్, జిల్లా అధికారులు, రజక సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

రజక సంఘం ఆధ్వర్యంలో..

జిల్లా రజక సంఘం ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ వద్ద గల ఐలమ్మ విగ్రహం వద్ద వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి అతిథులుగా హాజరయ్యారు. రజక సంఘం అధ్యక్షుడు దండు శ్రీనివాస్ మాట్లాడుతూ, ఐలమ్మ విగ్రహ స్థాపన కేటీఆర్ కృషిని కొనియాడారు. మున్సిపల్ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, కౌన్సిలర్లు అన్నారం శ్రీనివాస్, వెలుండి దేవదాస్, లింగంపల్లి సత్యనారాయణ, దార్ల సందీప్, అర్బన్ బ్యాంక్ చైర్మన్ రాపెల్లి లక్ష్మీనారాయణ, అడ్డగట్ల మురళి, అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు కత్తెర దేవదాస్, మాల మహానాడు నాయకులు రాగుల రాములు, రజక సంఘం ప్రతినిధులు బాలయ్య, కాసర్ల మహేందర్, మారుపాక శ్రీనివాస్, విక్రమ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఎండీకి నీటి విడుదల నిలిపివేత



మిడ్‌మానేరు ప్రాజెక్టు

బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరు నుంచి ఎల్‌ఎండీకి మంగళవారం నీటి విడుదల నిలిపివేశారు. ఎల్‌ఎండీ పూర్తి నీటి నిల్వ సామర్థ్యానికి చేరుకోవడంతో నీటి విడుదల ఆపినట్లు తెలిసింది. మిడ్‌మానేరులోకి ఎస్సారెస్పీ నుంచి 11,600 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. మిడ్‌మానేరులో నీటిమట్టం 22.97 టీఎంసీలకు చేరింది.

సాక్షి | Special Story



- ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ కీలక శాఖల్లో మహిళా అధికారులు
- సొంత నిర్ణయాలతో తమదైన ముద్ర
- పథకాలను ప్రజలకు చేరుస్తూ.. సమస్యల పరిష్కారం
- పురుష అధికారులతో సమానంగా విధులు నిర్వహిస్తూ ఆదర్శం

పాలనలో ఆమె సంతకం

ఆత్మవిశ్వాసంతో ముందుకుసాగుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పలువురు మహిళా అధికారులు. సొంతంగా నిర్ణయాలు తీసుకుంటూ పాలనలో తమదైన ముద్ర వేస్తున్నారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో, వారి సమస్యలు పరిష్కరించడంలో ముందు వరుసలో ఉంటున్నారు. పురుష అధికారులతో సమానంగా విధులు నిర్వహిన్నారు. కిందిస్థాయి నుంచి మొదలుకొని జిల్లాస్థాయి అధికారిగా ఉంటూ ప్రజలకు సేవలందిస్తూ ఉన్నతాధికారుల మన్ననలు పొందుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పోలీస్, న్యాయ, రెవెన్యూ, విద్య, వైద్యం, మెప్మా, వ్యవసాయశాఖ తదితర శాఖల్లో సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్నారు. – సాక్షి,పెద్దపల్లి/కరీంనగర్ అర్బన్

కీలక స్థానాల్లో వారే..

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పలు శాఖల్లోని కీలకమైన స్థానాల్లో మహిళా అధికారులే ఉన్నారు. ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా ప్రతిమ, జగిత్యాల జిల్లా కోర్టు న్యాయమూర్తిగా నీలిమ, కరీంనగర్ కలెక్టర్‌గా పమేలా సత్పతి, పెద్దపల్లి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా అరుణశ్రీ, పెద్దపల్లి డీసీపీగా డాక్టర్ చేతన, వేములవాడ ఏఎస్పీగా శేషాద్రినిరెడ్డి, కరీంనగర్ మున్సిపల్ కమిషనర్‌గా చాహత్ బాజ్‌పేయ్, కరీంనగర్ డీఎంహెచ్‌వోగా సుజాత, డీఏవోగా భాగ్యలక్ష్మి, జగిత్యాల డీఏవోగా వాణి, కరీంనగర్ సంక్షేమ అధికారిగా సరస్వతి, ఆర్టీసీ ఆర్‌ఎంగా సుచరిత, రామగుండం మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా హిమబిందు సింగ్, పెద్దపల్లి సహకార శాఖ అధికారి శ్రీమాల, పెద్దపల్లి డీఈవోగా మాధవి, ఇంటర్మీడియట్ నోడల్ అధికారిగా కల్పన, ఉమ్మడి జిల్లా దేవాదాయశాఖ అదనపు కమిషనర్‌గా నాయిని సుప్రియ.. ఇలా.. వివిధ శాఖల్లో మహిళా అధికారులు కీలకంగా వ్యవహరిస్తున్నారు.

ఆలోచనా విధానం మారాలి

జీవితంలో అనేక పాత్రలు పోషిస్తున్నా.. మహిళలపై ఇప్పటికీ దాడులు జరుగుతున్నాయి. ఈ అనాగరిక ధోరణి నుంచి మనిషి ఆలోచనా విధానం మారాలని నిపుణులు సూచిస్తున్నారు. రాజకీయ రంగంలోనూ మహిళలు దూసుకెళ్తున్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు అమలుతో వారి ప్రాతినిధ్యం మరింత పెరిగే అవకాశాలున్నాయి. ఏ సంస్థలోనైనా, ఏ రంగంలోనైనా తగిన శిక్షణ, సానుకూల వాతావరణాన్ని కల్పిస్తే వారు అనూహ్య ఫలితాలు సాధిస్తారు.

మహిళల ప్రాతినిధ్యం పెరిగింది



అటెండర్ నుంచి అంతరిక్షం వరకు ప్రతీ రంగంలో మహిళల ప్రాతినిధ్యం పెరిగింది. నాకు అదనపు కలెక్టర్‌గా సేవలందించే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నాను. మహిళలు రాజకీయాల్లో వెనకబడి ఉన్నారు. సివిల్ సర్వీసులోకి వచ్చే వారు 7 శాతమే. విజయానికి ఆడ, మగ అనే తేడా లేదు. లక్ష్యాలను నిర్దేశించుకొని, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి. ఆడపిల్లలను ప్రోత్సహించేవారి సంఖ్య పెరుగుతోంది. అది వంద శాతానికి చేరాలి.

– లక్ష్మీకిరణ్, అదనపు కలెక్టర్(రెవెన్యూ), కరీంనగర్

యువతుల్లో చైతన్యం కనిపిస్తోంది



పరిపాలనలో మహిళల భాగస్వామ్యం పెరిగింది. జిల్లాలో చైతన్యం ఎక్కువ. ఆడపిల్లలంటే ఒకప్పుడు వివక్ష ఉండేది. ఇప్పుడు మార్పు వచ్చింది. వ్యవసాయశాఖకు జిల్లా అధికారిగా పని చేయడం సంతోషంగా ఉంది. పల్లెల్లో సమావేశాల్లో పాల్గొన్నప్పుడు యువతుల్లో చైతన్యం కనిపిస్తోంది. స్వయం ఉపాధి పొందేవారు, ఉన్నత విద్యనభ్యసిస్తున్నవారిని చూస్తే గర్వంగా అనిపిస్తోంది.

– భాగ్యలక్ష్మి, డీఏవో, కరీంనగర్

చదువుతోనే సాధికారత



చదువుతోనే మహిళా సాధికారిత సాధ్యమవుతుంది. ఎంచుకున్న రంగంలో ప్రతిభ చాటేందుకు ఇష్టంగా ముందుకుసాగాలి. ఎవరి జీవితం అనతికాలంలో ఉన్నతస్థానానికి చేరదు. కఠోర శ్రమ అవసరం. లక్ష్య సాధనకు నిర్విరామ కృషి ఉండాలి. ఆడవాళ్లు ఉన్నత చదువులు, ఉద్యోగాలకు పోటీపడాలి. ఏ రంగాన్ని ఎంచుకున్నా అందులో పరిపూర్ణత సాధించాలి.

– అరుణశ్రీ, అదనపు కలెక్టర్, పెద్దపల్లి

చట్టాలపై అవగాహన ఉండాలి



మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. ఆత్మనిర్భరత, నిర్ణయం తీసుకునే అధికారం కలిగి ఉండాలి. విద్య, వృత్తి, వివాహం, కుటుంబ వ్యవహారాల్లో క్రియాశీలక పాత్ర పోషించాలి. ప్రభుత్వాలు మహిళల కోసం చేసిన చట్టాలు, న్యాయ సేవలపై ప్రతీ ఒక్కరికి అవగాహన ఉండాలి. పోలీస్‌శాఖలో గతంతో పోలిస్తే మహిళా సిబ్బంది ప్రాతినిధ్యం పెరిగింది.

– డాక్టర్ చేతన, డీసీపీ, పెద్దపల్లి


ఆడపిల్లలను ప్రోత్సహించాలి



ఆడపిల్లలకు వయసు రాగానే పెళ్లి చేయాలని తల్లిదండ్రులు ఆరాటపడుతుంటారు. అలా కాకుండా, వారు ఎంచుకున్న లక్ష్యాలు సాధించేవరకు ప్రోత్సహించాలి. లక్ష్యసాధనకు తోడ్పాటునందించాలి. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఆడవారిని ఎలా గౌరవించాలో నేర్పించాలి. మగ, ఆడ అనే తేడా లేకుండా అందరూ సమానమేనన్న భావన కలిగించాలి.

– మాధవి, డీఈవో, పెద్దపల్లి

చాలెంజ్‌గా తీసుకుంటా



కోల్‌సిటీ(రామగుండం): కొన్ని రంగాల్లో మహిళలు చిన్నచూపునకు గురవుతున్నారు. వాటిని పట్టించుకోకుండా ప్రతీ పనిని చాలెంజ్‌గా తీసుకోవాలి. నేను చాలెంజ్‌తో ముందుకు సాగుతున్నా. పురుషుల కన్నా మహిళకు ఇల్లు, ఫ్యామిలీ, ఉద్యోగం, అనారోగ్య సమస్యలు చాలా ఉంటాయి. లీడర్‌షిప్ క్వాలిటీస్ విషయంలో సపోర్ట్ దొరకదు. నిలోఫర్ ఆస్పత్రిలో హెచ్‌వోడీగా చేస్తున్న నన్ను, ప్రభుత్వం అడిషనల్ డీఎంఈ క్యాడర్ హోదా కల్పిస్తూ ప్రమోషన్ ఇచ్చింది. కొత్తగా ఏర్పాటు చేసిన రామగుండంలోని సిమ్స్ కాలేజీకి ప్రిన్సిపాల్‌గా రెండున్నరేళ్ల క్రితం బాధ్యతలు అప్పగించారు. తొలి ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టిన కొంతకాలం ఇబ్బందులు ఎదురయ్యాయి. ప్రొఫెషనల్ ఒత్తిళ్లతో బిజీగా ఉన్నా కుటుంబానికి సమయం కేటాయిస్తా.

– డాక్టర్ హిమబిందు సింగ్, ప్రిన్సిపాల్, సిమ్స్, గోదావరిఖని

క్లుప్తంగా

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడికి సీఎం అభినందనలు



సీఎం రేవంత్‌రెడ్డితో సంపత్ కుమార్

గంభీరావుపేట(సిరిసిల్ల): మండలంలోని దమ్మన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భౌతికశాస్త్రం ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న తాడూరి సంపత్‌కుమార్ ఇటీవల జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడిగా పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం ప్రగతి భవన్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ఆయనకు అభినందనలు తెలిపారు. సీఎం వెంట మంత్రి శ్రీధర్‌బాబు ఉన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడికి సన్మానం



వేములవాడ: టీపీసీసీ అధ్యక్షుడిగా నియమితులైన మహేశ్‌గౌడ్‌ను మంగళవారం విప్ ఆది శ్రీనివాస్ హైదరాబాద్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శాలువాతో సన్మానించారు.

వృద్ధుడి బలవన్మరణం



పోచయ్య (ఫైల్)

కోనరావుపేట(వేములవాడ): కుటుంబ కలహాలతో ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల ప్రకారం.. కోనరావుపేట మండలంలోని శివంగాలపల్లికి చెందిన మక్కపెల్లి పోచయ్య(75) కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. దీనికి తోడు రెండు రోజులుగా ఇంట్లో గొడవలు జరుగుతుండటంతో మనస్తాపానికి గురయ్యాడు. మంగళవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకున్నాడు. కాసేపటికి గమనించిన కుటుంబసభ్యులు అతన్ని కిందికి దించి, కోనరావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి, అక్కడి నుంచి సిరిసిల్ల జిల్లా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య లచ్చవ్వ, కుమారుడు పర్శరాములు, కూతురు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

చిరుతదాడిలో గొర్రె మృతి?



చందుర్తి(వేములవాడ): మండలంలోని లింగంపేట శివారు అటవీ ప్రాంతంలో మంగళవారం సాయంత్రం చిరుత దాడిలో గొర్రె మృతిచెందినట్లు స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. స్థానికుల వివరాల ప్రకారం.. లింగంపేట శివారులోని కొత్తకుంట ప్రాంతంలో ఇదే గ్రామానికి చెందిన డోకే రాజయ్య గొర్రె మృతిచెందింది. గతంలో ఇదే ప్రాంతంలో చిరుత దాడిలో మేక మృతిచెందడంతో, ప్రస్తుతం గొర్రెను కూడా చిరుత చంపినట్లు భావిస్తున్నారు. పశువుల కాపరులు ఆందోళన చెందుతున్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

ముస్తాబాద్: మండలంలోని వెంకట్రావుపల్లిలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. గ్రామానికి చెందిన పోశంపల్లి పద్మ ఇంట్లోకి దొంగలు చొరబడి బీరువాలోని రెండున్నర తులాల పుస్తెలు, చెవికమ్మలు, 27 తులాల వెండి పట్టీలతోపాటు రూ.15వేల నగదును అపహరించుకుపోయారు. పద్మ భర్త సత్తయ్య పదేళ్ల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. పాడుబడిన ఇంట్లో ఉంటుండగా భయంతో పక్కింట్లో ఉంటున్న అత్త బుచ్చవ్వ ఇంట్లో కూతురితో కలిసి సోమవారం రాత్రి నిద్రించింది. ఇదే అదనుగా భావించిన దొంగలు ఇంటి తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. పోలీసులు పరిశీలించి విచారణ చేపట్టారు.

ఏకదంతాయ.. భిన్న రూపాయ..



వెంకంపేటలో పంచసర్పం ఆకారంలో..



మెహర్‌నగర్‌లో బాల గణేశుడు



బీవైనగర్‌లో అయోధ్య రాముని సెటప్‌లో..



సిద్ధార్థనగర్‌లో భారీ ఆకారంలో..



శాంతినగర్‌లో హంసవాహనంపై..

జిల్లా కేంద్రంలో గణేశ్ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. పట్టణంలోని పలు వార్డుల్లో వినాయక విగ్రహాలకు స్థానికులు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. వివిధ ప్రాంతాల్లో వైవిధ్యరూపాల్లో ప్రతిష్ఠించిన గణనాథుని విగ్రహాలు ఆకట్టుకుంటున్నాయి. ఏకదంతుడి విభిన్న రూపాలను దర్శించుకునేందుకు భక్తులు ఉత్సాహం చూపుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్న సిరిసిల్ల

మనోధైర్యంతో ముందుకెళ్లాలి

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్, డీఎంహెచ్‌వో వసంతరావు

సిరిసిల్లటౌన్: మానసిక ఒత్తిడి, సమస్యలతో బాధపడేవారు మనోధైర్యంతో ముందుకెళ్లాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. మంగళవారం ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో టోల్ ఫ్రీ నంబరు 14416, పోస్టర్‌ను ఎస్పీ అఖిల్ మహాజన్, డీఎంహెచ్‌వో డాక్టర్ వసంతరావుతో కలిసి ఆవిష్కరించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో ర్యాలీలు నిర్వహించి ఆత్మహత్యల నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. మానసిక సమస్యలకు చికిత్స తీసుకోకుండా దాచిపెట్టుకుని ఉండటం సరికాదన్నారు. మానసిక వ్యాధిగ్రస్తులు ఆత్మహత్యకు పాల్పడే వారి వివరాలను టోల్ ఫ్రీ నంబరును తెలియజేస్తే వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. ఆత్మన్యూనత భావనతో ఉన్నవారికి చేయూతనివ్వాలని వైద్యారోగ్య సిబ్బందిని ఆదేశించారు.

బాధితులకు గడువులోగా సాయం

రోడ్డు ప్రమాద బాధితులకు గడువులోగా సాయం అందాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. మంగళవారం ‘హిట్ అండ్ రన్ కమిటీ’ సమావేశాన్ని ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి నిర్వహించి మాట్లాడారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ప్రమాదాల బాధితులకు రెవెన్యూ, పోలీసు శాఖల నివేదికల ప్రకారం నిర్ణీత గడువులోగా పరిహారం ఇవ్వాలని సూచించారు. ఆర్డీవోలు రమేశ్, రాజేశ్వర్, డీఎంహెచ్‌వో డాక్టర్ వసంతరావు, డీటీవో లక్ష్మణ్, ఏవో శ్రీకాంత్ తదితరులున్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

ఇందిరా మహిళ శక్తి పథకాన్ని సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికంగా ఎదగాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. జిల్లా మెడికల్ కాలేజీలో ఏర్పాటు చేసిన మహిళా శక్తి క్యాంటిన్ ప్రారంభించారు. తంగళ్లపల్లికి చెందిన మార్కండేయ మహిళా సమాఖ్యకు రూ. 3లక్షల రుణం మంజూరు కాగా ఇందిరా మహిళ శక్తి క్యాంటిన్‌ను ఏర్పాటు చేశారు. డీఆర్‌డీవో శేషాద్రి, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ, అదనపు డీఆర్‌డీవో శ్రీనివాస్, సమాఖ్య అధ్యక్షురాలు సరిత, డీపీఎంలు సంధ్యారాణి, పద్మయ్య పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడు పాకాల శంకర్‌గౌడ్‌ను కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సన్మానించారు. తన చాంబర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. శంకర్‌గౌడ్ కుసుమ రామయ్య పాఠశాలలో పనిచేస్తూ పిల్లలకు అందిస్తున్న సేవలను తెలుసుకుని ప్రశంసించారు. హెచ్‌ఎం మోతీలాల్ తదితరులు పాల్గొన్నారు.

నవరాత్రులు.. ఆధ్యాత్మిక కార్యక్రమాలు



గరికపూజ కార్యక్రమంలో భక్తులు

సిరిసిల్లటౌన్: ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏటా వినాయకుని నవరాత్రోత్సవాలు ప్రత్యేక పూజలతో నిర్వహిస్తారు. 50 ఏళ్లుగా క్రమం తప్పకుండా నవరాత్రి వేడుకల్లో రోజూ ప్రత్యేకత చాటే ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపడుతారు. గరక, ఫలహారాలు, లక్షపుష్పార్చన, బిళ్వార్చన, హోమాలు, మహానైవేద్యం.. ఇలా రోజొక దైవ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ తమదైన శైలిని అనుసరిస్తున్నారు. ప్రస్తుతం సంఘం అధ్యక్షుడిగా కట్కం సత్తయ్య వ్యవహరిస్తున్నారు. ఇందులో దాదాపు 2,000 మంది సభ్యులు ఉండగా, దాతలు తమకు తోచినంత విరాళం అందిస్తారు. బయట ఎక్కడా చందాలు వసూలు చేయరు. మంగళవారం నిర్వహించిన గరిక పూజలో అల్లాడి సరస్వతి–శ్రీనివాస్, కటుకం గీతాభవాని–శ్రీనివాస్, చేపూజి వనజ–శ్రీనివాస్, ఎల్లంకి శివరంజని–శ్రీనివాస్, గట్టు వాణి–వేణు తదితరులు పాల్గొన్నారు.

కోర్టు తీర్పు రాకముందే చర్యలు సరికాదు

సిరిసిల్లటౌన్: బీజేపీ నేతలు, మున్సిపల్ అధికారుల తీరుపై సిరిసిల్ల మున్సిపల్ వైస్‌చైర్మన్ ఘాటుగా స్పందిస్తూ..సంచలన వ్యాఖ్యలు చేశారు. మంగళవారం సిరిసిల్లలో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్లో మాట్లాడారు. బీజేపీ నేతల అసత్య ఆరోపణలతో కోర్టు తీర్పు రాకముందే మున్సిపల్ అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించారని విమర్శించారు. సిరిసిల్లలోని గోపాల్‌నగర్‌లో గల తన భవంతిని 2004లో అనుమతులతో నిర్మించడం జరిగిందన్నారు. కానీ వ్యక్తిగతంగా కక్షగట్టిన బీజేపీ నాయకుడు నాగుల శ్రీనివాస్ తనపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారన్నారు. తన భవన నిర్మాణంలో తప్పులుంటే కోర్టు ఇచ్చే తీర్పుకు కట్టుబడి ఉంటానని, గతంలోనే మున్సిపల్ అధికారులకు తెలియజేసినట్లు వెల్లడించారు. పట్టణంలోని పలువురు భవనాల యజమానులను బ్లాక్‌మెయిల్‌కు పాల్పడే వారికి ప్రజలే సరైన రీతిలో బుద్ధి చెబుతారని హెచ్చరించారు. బీఆర్‌ఎస్ నాయకులు మ్యాన రవి, దార్ల సందీప్, అన్నారం శ్రీనివాస్, సత్తార్, మురళి, తదితరులు పాల్గొన్నారు.

పర్మిట్ లేదు..ట్యాక్స్ కట్టలే..

- స్కూల్, గూడ్స్ వాహనాలపై కేసు



పర్మిట్ లేని స్కూల్ బస్సును పట్టుకున్న ఎంవీఐ

సిరిసిల్లటౌన్: పర్మిట్ అయిపోయిన స్కూల్ బస్సులు, ట్యాక్స్ లేకుండా ప్రైవేటు ట్రాన్స్‌పోర్టు మోటార్ వెహికిల్స్ రోడ్లపై రైట్ రైట్ అంటూ తిరగడం ఎంవీఐ ఆకస్మిక తనిఖీల్లో బయటపడ్డాయి. మంగళవారం సిరిసిల్ల మోటార్ వెహికిల్ ఇన్స్‌పెక్టర్ వంశీధర్ నేతృత్వంలో జిల్లా కేంద్రంతో పాటు గంభీరావుపేటలో సిబ్బంది వాహనాలు తనిఖీలు చేశారు. సిరిసిల్లలో 1, గంభీరావుపేటలో 2 స్కూల్ బస్సులు పర్మిట్ అయిపోయినా తిప్పుతుండటం గమనించారు. మరో వైపు ఆటో గూడ్స్ క్యారియర్, ట్రాక్టర్ ట్రాలీకి అనుమతితో పాటు ట్యాక్స్ కట్టకుండా రోడ్లపై తిరుగుతుండటంపై ఆయన మండిపడ్డారు. పర్మిట్ లేకుండా, ట్యాక్స్ చెల్లించకుండా, నిబంధనలు పాటించని వాహనాల యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎంవీఐ హెచ్చరించారు. మొత్తం ఐదు వాహనాలపై కేసులు నమోదు చేశారు. ఎంవీఐతో పాటు కానిస్టేబుల్ ప్రశాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా సంఘం భూమిని కాపాడండి



ధర్నా చేస్తున్న మహిళా సంఘం సభ్యులు

ముస్తాబాద్(సిరిసిల్ల): మండలంలోని పోతుగల్ స్వశక్తి మహిళా సంఘం సభ్యులు మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. పోతుగల్‌లో స్వశక్తి సంఘం భవనానికి సంబంధించిన ప్రహరీ నిర్మాణానికి కరీంనగర్ ఎంపీ ద్వారా రూ.3లక్షలు మంజూరు అయ్యాయని ఈసందర్భంగా బీజేపీ నాయకుడు చీకోటి మహేశ్ తెలిపారు. ప్రహరీ పనులు ప్రారంభించగా, కొంత మంది అడ్డుకున్నారన్నారు. మహిళా సంఘానికి చెందిన స్థలాన్ని కొంత మంది కబ్జా చేశారని, వారి నుంచి స్థలం కాపాడాలని కోరారు. మాజీ సర్పంచ్ నారాయణరావు 12 గుంటల స్థలాన్ని మహిళా సంఘానికి కేటాయించారని, అందులోనే భవనం నిర్మించడం జరిగిందన్నారు. సదరు 12 గుంటల స్థలంలో ప్రహరీ నిర్మిస్తే కబ్జా చేసిన అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘం స్థలాన్ని తమకు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని మహిళలు తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. సభ్యులు భారతవ్వ, పోషవ్వ, లీలవ్వ, ఎల్లవ్వ, లక్ష్మి, లస్మవ్వ, బాబాయి, ముత్తవ్వ, బాలమ్మ, భూదవ్వ, బాల్‌లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కుక్క దాడిలో 10 మందికి గాయాలు



ఆస్పత్రి వద్ద బాధితులు

కథలాపూర్(వేములవాడ): మండలంలోని భూషణరావుపేటలో కుక్క దాడిలో 10 మంది గాయపడ్డారు. గ్రామస్తుల వివరాల ప్రకారం.. మంగళవారం ఉదయం వివిధ పనుల నిమిత్తం రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న, బైక్‌లపై వెళ్తున్నవారిపై కుక్క దాడి చేసింది. గాయపడినవారు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి, చికిత్స పొందారు. గ్రామంలో కుక్కల బెడద తీవ్రంగా ఉందని, అధికారులు వాటిని దూరంగా తరలించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రాజన్న సేవలో యాదగిరిగుట్ట ఈవో



ఈవో భాస్కర్‌రావు కుటుంబ సభ్యులకు స్వాగతం పలుకుతున్న ఆలయ అధికారులు, అర్చకులు

వేములవాడ: వేములవాడ రాజన్నను మంగళవారం యాదగిరిగుట్ట ఆలయ ఈవో భాస్కర్‌రావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు వారికి ఘన స్వాగతం పలికారు. అనంతరం వేదోక్త ఆశీర్వచనం గావించారు. ఆలయ ఏఈవోలు గజేవెల్లి రమేశ్‌బాబు, శ్రవణ్, ప్రభుత్వ విప్ పీఎస్ గోలి శ్రీనివాస్, ప్రొటోకాల్ పర్యవేక్షకులు అశోక్, ఎడ్ల శివ పాల్గొన్నారు.

సీఎం ప్రకటనపై హర్షం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు తదితరులు

సిరిసిల్లటౌన్: సీఎం రేవంత్‌రెడ్డి సిరిసిల్ల మరమగ్గాలకు వస్త్ర ఆర్డర్లు ఇస్తామన్న ప్రకటనపై కార్మికక్షేత్రంలో అన్ని వర్గాల నుంచి హర్షం వ్యక్తమైంది. పట్టణ కాంగ్రెస్, చేనేత సెల్ విభాగాలు, ఆసాముల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. చేనేతన్న విగ్రహానికి పూలమాలలు వేసి, సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, తుమ్మల నాగేశ్వర్‌రావు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, నాగుల సత్యనారాయణగౌడ్, కాముని వనిత, వెల్ముల స్వరూప, గడ్డం నర్సయ్య, పద్మశాలీ జేఏసీ నాయకులు ఆడెపు భాస్కర్, తాటిపాముల దామోదర్, యెల్లె లక్ష్మీనారాయణ, మండల సత్యం తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆసాముల సమన్వయ కమిటీ అధ్యక్షుడు సిరిసిల్ల రవీందర్, ప్రధాన కార్యదర్శి చేర్యాల అశోక్, మండల రాజు, సాగర్, శ్రీనివాస్ తదితరుల ఆధ్వర్యంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

ముస్తాబాద్(సిరిసిల్ల): షరతులు లేకుండా రుణమాఫీ చేసి రైతులను ఆదుకోవాలని బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని చిప్పలపల్లిలో గాంధీ విగ్రహం ఎదుట కళ్లకు గంతలతో ఆందోళన చేపట్టారు.రేషన్‌కార్డులు, ఐటీతో సంబంధం లేకుండా రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ వర్తింపజేయాలన్నారు. ఎన్నికల హామీని చిత్తశుద్ధితో అమలు చేయాలని డిమాండ్ చేశారు. మెంగని మనోహర్, శీలం స్వామి, గాడిచర్ల భరత్, తాడెపు ఎల్లం, రాజమల్లు, రమేశ్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



ఆటోలను సీజ్‌చేస్తున్న పోలీసులు

తంగళ్లపల్లి: మండలంలోని జిల్లెల్ల గ్రామ శివారు నంచి అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న మూడు ఆటోలను సోమవారం సీజ్ చేసినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ... జిల్లెల్ల శివారునుంచి అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నారన్న సమాచారం మేరకు పోలీస్, సీసీఎస్ ఆధ్వర్యంలో మూడు ఆటోలు, 15 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. చిన్నకోడూరు మండలం రామంచ గ్రామస్తులు కర్రె సంతోష్, కర్రె వెంకటేశ్ తోపాటు జిల్లెల్ల గ్రామస్తుడు పర్వతం ప్రవీణ్ లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వీరితోపాటు రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేస్తున్న మోహినికుంటకు చెందిన కనకయ్య, ఇబ్రహీంనగర్‌కు చెందిన అనారసి సంపత్, జిల్లెల్ల గ్రామానికి చెందిన పాండులపై కూడా కేసు నమోదు చేశామన్నారు. రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

కిడ్నీలు దెబ్బతిని.. అచేతన స్థితికి

- ప్రాణాపాయ స్థితిలో బాలిక
- కిడ్నీ మార్పిడి చేయాలన్న వైద్యులు
- తల్లి ఇచ్చేందుకు ముందుకొచ్చినా సైజు సరిపోవడం లేదు
- వైద్య ఖర్చులకు ఆర్థిక ఇబ్బందులు
- దాతల సాయం కోసం తల్లిదండ్రుల ఎదురుచూపు



చికిత్స పొందుతున్న రేణ



వేడుకుంటున్న తల్లిదండ్రులు రంజిత-రమేశ్

జమ్మికుంట(హుజూరాబాద్): ఆడుతూ పాడుతూ చదువుకునే వయసులో రెండు కిడ్నీలు దెబ్బతిని, ఆ బాలిక ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతోంది. ఆస్పత్రిలో అచేతన స్థితిలో ఉన్న బిడ్డను చూస్తూ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. జమ్మికుంట మండలంలోని బిజిగిరిషరీఫ్ గ్రామానికి చెందిన రాచపల్లి రమేశ్‌-రంజిత దంపతులు. వీరికి ఒక కూతురు, ఇద్దరు కుమారులు ఉన్నారు. రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబం. రమేశ్ ఆటోడ్రైవర్. వీరి కూతురు రేణ నాలుగో తరగతి చదువుతోంది. ఆడుతూ పాడుతూ సందడి చేసే పాప ఉన్నట్టుండి తీవ్ర అనారోగ్యానికి గురైంది. ఆస్పత్రికి తీసుకెళ్తే రెండు కిడ్నీలు దెబ్బతిన్నాయని వైద్యులు తెలిపారు. దీంతో తల్లిదండ్రులు ఆమెను హైదరాబాద్‌లోని నిలోఫర్ ఆస్పత్రిలో చేర్పించారు. 13 రోజులుగా అక్కడే చికిత్స పొందుతోంది. డయాలసిస్ కొనసాగిస్తున్నారు. వైద్యులు రేణకు కిడ్నీ మార్పిడి చేయాలన్నారు. తల్లి తన కిడ్నీ ఇవ్వడానికి ముందుకొచ్చినా సైజు సరిపోవడం లేదని తెలిపారు. మరోవైపు ఆర్థిక ఇబ్బందులతో రేణ తల్లిదండ్రులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. దాతలు స్పందించి, కిడ్నీ దొరికేలా చూడాలని, ఆర్థికంగా చేయూతనిచ్చి, తమ బిడ్డను కాపాడాలని వేడుకుంటున్నారు.

సాయం చేయాల్సినవారు సంప్రదించాలి

రాచపల్లి రమేశ్, ఫోన్ పే నంబర్ : **99599 75229**

రాచపల్లి రంజిత బ్యాంక్ అకౌంట్ నంబర్: **026310100219456**

అనుకున్నది చదవలేకపోయానని..

- మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య
- పెంబట్లలో విషాదం



సాయిచరణ్ (ఫైల్)

సారంగాపూర్(జగిత్యాల): ఆర్థిక పరిస్థితుల కారణంగా అనుకున్నది చదవలేకపోయానని మనోవేదనకు గురైన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై దత్తాద్రి కథనం ప్రకారం.. సారంగాపూర్ మండలంలోని పెంబట్లకు చెందిన తేలు చంద్రయ్య–సుకన్య దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. వారికున్న మూడెకరాల భూమిలో వ్యవసాయం చేస్తూ కొడుకులను పోషించుకుంటున్నారు. పెద్ద కుమారుడు సాయిచరణ్(21) తన మిత్రులతో కలిసి హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు చేయాలనుకున్నాడు. కానీ, ఆర్థిక పరిస్థితులు సహకరించకపోవడంతో జగిత్యాలలో డిగ్రీ చదువుతున్నాడు. అతని స్నేహితులు హోటల్ మేనేజ్‌మెంట్ పూర్తి చేసి, విదేశాల్లో ఉద్యోగం చేస్తున్నారు. దీంతో తాను అనుకున్నది చదవలేకపోయానని కుటుంబసభ్యులు, మిత్రుల వద్ద తరచూ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురై, ఈ నెల 4న రాత్రి 11 గంటల సమయంలో క్రిమిసంహారక మందు తాగాడు. తల్లిదండ్రులు జగిత్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అతను కోలుకోకపోవడంతో కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు దవాఖానాకు తీసుకువచ్చారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

అంతర్రాష్ట్ర గంజాయి విక్రేతల అరెస్టు

- 12 కిలోల గంజాయి స్వాధీనం
- వివరాలు వెల్లడించిన జగిత్యాల ఎస్పీ అశోక్‌కుమార్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

జగిత్యాల క్రైం: అంతర్రాష్ట్ర గంజాయి విక్రేతలను అరెస్టు చేసినట్లు జగిత్యాల ఎస్పీ అశోక్‌కుమార్ తెలిపారు. మంగళవారం సాయంత్రం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. కొడిమ్యాల మండలంలోని పూడూరుకు చెందిన ఎద్మలపల్లి సాయికుమార్, తుదుం సాయితేజ, కందుల అరుణ్, గౌరాపూర్‌కు చెందిన ఎడపెల్లి సాకేత్, జగిత్యాల అర్బన్ మండలం ధరూర్ గ్రామానికి చెందిన పాల రాజ్‌కుమార్, అఖిల్ కొంతకాలంగా ఆంధ్ర, ఒడిశా రాష్ట్రాలకు వెళ్లి, గంజాయి తెస్తూ ఇక్కడ విక్రయిస్తున్నారు. సాయికుమార్, సాయితేజ బైక్‌పై వెళ్లి, ఒడిశా బార్డర్‌లో గుర్తు తెలియని వ్యక్తి వద్ద రూ.43 వేలకు 16 కిలోల గంజాయి కొనుగోలు చేశారు. ఈ నెల 3న పూడూరుకు తీసుకువచ్చారు. గ్రామ శివారులో చెట్ల పొదల్లో దాచిపెట్టారు. అందులో నుంచి 4 కిలోల గంజాయిని అఖిల్ హైదరాబాద్ తీసుకెళ్లాడు. మంగళవారం మధ్యాహ్నం మిగతా 12 కిలోలను విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా కొడిమ్యాల ఎస్సై సందీప్, కానిస్టేబుళ్లు రాజయ్య, తిరుమల్, రాజు, వినోద్ పట్టుకున్నారు. గంజాయితోపాటు రెండు బైక్‌లు, 6 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురిని అరెస్టు చేశామని, అఖిల్ పరారీలో ఉన్నాడని ఎస్పీ తెలిపారు. నిందితులను పట్టుకునేందుకు కృషి చేసిన డీఎస్పీ రఘుచందర్, మల్యాల సీఐ రవి, ఎస్సై సందీప్, కానిస్టేబుళ్లను అభినందించి, రివార్డు అందించారు.